




పారదర్శకంగా నష్టపరిహారం అంచనా

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం జగన్మోహన్‌రెడ్డి

నెల్లూరు :మాండూస్ వల్ల నష్టపోయిన వారికి ఉదారంగా నష్టపరిహారం చెల్లించేలా, ఎన్యూమరేషన్ ప్రక్రియను పార దర్శకంగా కచ్చితంగా చేపట్టాలని బాధి తులకు న్యాయం జరగాలని మరియు పునరావాస కేంద్రాల లో ఉంటూ ఆశ్రయం పొందిన వారికి ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థిక సాయం అంద జేయాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును ఆదేశించారు. మాండౌస్ తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలపై సోమవారం తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి తుఫాను ప్రభావిత జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించారు. కలెక్టరేట్లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా అధికారులు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జిల్లా అధికారులు

కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలి..!



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గపూర్

- ◆జిల్లాలో సమరశీల ఉద్యమాలు సాగాలి
- ◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ. గఫూర్
- ◆నూతన కమిటీఎన్నిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కార్మికుల జీవితాలు మారాలంటే ప్రభుత్వ విధానాలలో మార్పు రావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎగఫూర్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణం రాఘవేంద్ర కళ్యాణ మండలంలో సిఐటియు జిల్లా 11వ మహాసభల ప్రతినిధుల సభ నిర్వహించారు. తొలుత సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నగేష్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం సభలో ఎంఎ గఫూర్ మాట్లాడుతూ కార్మికుల భవిష్యత్తు కోసం వాళ్లకు మంచి జీవితం ఇవ్వడం కోసం సిఐటియు ప్రయత్నం చేస్తుంద న్నారు.కార్మికులకు మెరుగైన జీవితాలు రాకపోవడానికి కారణాలు ఏమిటని చాలామంది అనుకుంటున్నారన్నారు. కొందరు మన జీవితం ఇంతే, మన ఖర్మ, మన అదష్టం ఇంతే అని అనుకుంటూ జీవిస్తున్నారన్నారు.ఇది మన ఖర్మ మన అదష్టం అనేది ఇకనుంచి మర్చిపోండి. మన జీవితాలు మార్చుకోవాలంటే ప్రభుత్వ విధానాలలో మార్పు రావాలి. మనం హక్కుల కోసం పోరాడితే మనకు మంచి జీవితం సాధ్యమవుతుంది. మనం ఏమి చేయలేమని అనుకునేటటువంటి ధోరణిలో కాకుండా ఓ వైరాగ్యమైనటువంటి ధోరణిలో రాకుండా మనం హక్కుల కోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. బ్రిటిష్ కాలం నాటి హక్కులను ఇప్పుడున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ ఉద్యమాలను అణిచివేసే ధోరణలో ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయన్నారు. వీటిని ఎదుర్కోవాలంటే కార్మికులంతా ఏకం కావాలని, వారికి ఏవైతే హక్కులున్నాయో సాధించడం కోసం ముమ్మందు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉద్యమాలు చేసి ప్రభుత్వాలు మెడల వంచి హక్కులు సాధించుకోవడానికి ఈ మహాసభలలో తీర్మానాలు చేపట్టామన్నారు. 11వ మహాసభలో అధ్యక్షవర్గంగా టివి ప్రసాద్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, గోను దయాకర్ వ్యవహరించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జీవీ శివప్రసాద్, కార్యదర్శి కొండమూరి హాజరత్తయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, యుఇఇయు రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు, సిఐటి యు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, నాయకులు రెహనా బేగం, కె.సురేష్, ఎ.శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు అల్లాడి గోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు గంటా లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందాని, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం నాయకులు ఎం. నాగేంద్ర, ఆళ్ల హజరత్తయ్య, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, పద్మ, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను, బాలాజీ, తది తరులు పాల్గొన్నారు.



మెమొంటో అందజేస్తున్న నాయకులు

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా టివివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె అజయ్‌కుమార్

సిఐటియు జిల్లా నూతన కమిటీని 58 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.అజయ్ కుమార్, అధ్యక్షుడిగా టివివి ప్రసాద్‌ను తిరిగి మళ్లీ ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా 120 మందిని ఎన్నుకున్నారు. 21 మందితో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్నికైంది. మహాసభలో కీలక తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఎపి జెన్‌కో ప్రయి వేటీకరణను నిలుపుదల చేయాలని, ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంతాల్లో ఉపాధి కల్పించి, వలసలు నిలు వరించాలని, రామాయపట్నం పోర్టును త్వరితిగతిన పూర్తి చేయాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, కృష్ణపట్నం పోర్టులో కార్మిక చట్టాలను అమలు పరచాలని మహాసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. మహాసభ ఉత్సాహ పూరిత వాతా వరణంలో ముగిసింది.



టివివి ప్రసాద్ (అధ్యక్షులు)

కె అజయ్‌కుమార్ (ప్రధాన కార్యదర్శి)

నీటిలోనే నారుమళ్లు..!

- ❍ప్రాథమిక అంచనా 5వేల ఎకరాలు
- ❍నేటి నుంచి ఎన్యూమరేషన్
- ❍ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం- సిఎం జగన్

'మాండూస్' తుపాన్ ప్రభావంతో జిల్లా రైతాంగం తీవ్రంగా దెబ్బతింది. నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు పూర్తిగా నిండాయి. కాలువలు, నదుల్లోకి నీరు చేరింది.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో పెద్ద ఎత్తున నారు మళ్లు, నార్లు నీటిలోనే ఉన్నాయి. వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా ఐదు వేల ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. నేటి నుంచి ఎన్యూమరేషన్ చేపట్టనున్నారు. ఒకటి,రెండు రోజుల్లో నష్టం అంచనా వేయనున్నారు. ప్రతి ఒక్కరికీ ఉదారంగా నష్టపరిహారం చెల్లించేలా ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా కచ్చితంగా చేపట్టడంతో పాటు బాధితులకు న్యాయం జరగాలి. పునరావాస కేంద్రాలలో ఉంటూ ఆశ్రయం పొందిన వారికి ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థిక సాయం అందజేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

'మాండూస్' తుపాన్ కారణంగా దెబ్బతిన్న నారుమళ్లు, పంటల నష్ట అంచనాను అధికారులు నేటి నుంచి చేపట్టనున్నారు. తుపాన్ కారణంగా నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాపితంగా ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. ప్రధానంగా కోవూరు, మనుబోలు,నెల్లూరు రూరల్, వెంకటాచలం, ముత్తుకూరుతో పాటు అనేక మండలాల్లో ప్రస్తుతం నారుమళ్లు, నార్లు ఉన్నాయి. చెరువులు, కాలువల్లో భారీగా వరద నీరు రావడంతో అనేక చోట్ల పొలాల్లో నీరు చేరింది. దీని ప్రభావం కారణంగా నారుమళ్లు ఏ మేరకు నష్టపోయాయో చూడాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ అధికారులు అంచనా వేయనున్నారు. ప్రధానంగా జిల్లా వ్యాపితంగా ఐదు వేల ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. ఇవి కాకుండా కందుకూరు ప్రాంతాల్లో శనగ నీట మునిందిం. ఎంత మేరకు దెబ్బతిన్నాయో అధికారులు చూడాల్సి ఉంటుంది. అధికారులు పక్కాగా నష్టం అంచనా నిర్వహించి, నష్టపోయిన అందరికీ పరిహారం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్ చక్రధర్‌బాబును ఆదేశించారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలసి తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించారు. మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన వారికి ఉదారంగా నష్టపరిహారం చెల్లించేలా ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా కచ్చితంగా చేపట్టడంతో పాటు నష్ట పరిహారం అందచేయాలని, పంటలు దెబ్బతిన్న చోట మళ్లీ పంటలు వేసుకోవడానికి 80 శాతం సబ్సిడీ తో విత్తనాలు అందించాలని ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నష్టం అంచనాలు, పరిహారం పంపిణీ ప్రక్రియ వారం రోజుల లోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్.పి విజయ రావు, నెల్లూరు నగర కమిషనర్ హరితతో కలసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మాండూస్ తుపాను నేపథ్యంలో జిల్లాలో అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని, వర్షాల కారణంగా జరిగిన నష్టాలకు సంబంధించిన అంచనాలను సమగ్రంగా తయారు చేసి నివేదిక సమర్పించడం జరుగుతుందని కలెక్టర్ చక్రధర్ బాబు, ముఖ్యమంత్రికి వివరించారు. వరి, వేరుశనగకు సంబంధించిన విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేరకు సిద్ధంగా ఉంచడం జరిగిందని, జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా 208 మందిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు వారికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం కూడా అందించడం జరిగిందని కలెక్టర్, ముఖ్యమంత్రి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అడిషనల్ ఎస్‌పిలు హిమవతి, శ్రీలక్ష్మి, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ సుధాకర్ రావు, తెలుగు గంగ సిఇ హరి నారాయణ రెడ్డి, ఇరిగేషన్, సోమశిల, ఎస్ఇలు కష్ణమోహన్, వెంకట రమణారెడ్డి, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖ జేడిలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రంగవరప్రసాద్, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ శ్రీ వెంకట సుబ్బయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీవెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ సుబ్బారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.



నీట మునిగిన నారుమళ్లు

పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు

నెల్లూరు :తుపాన్ తీవ్రతకు నివాసాలు కోల్పోయిన బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలను కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. స్థానిక 18 వ డివిజన్ సర్వేపల్లి కాలువ కట్ట, గుర్రాల మడుగు సంఘం, తదితర ప్రాంతాలలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి సోమవారం పర్యటించారు.

దుప్పట్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రభుత్వ సంక్షేమ వసతి గహల్లోని విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వరా అంటూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి ప్రశ్నించారు. సోమవారం అయన మండలంలో పర్యటించారు. ఇస్కపాలెం గ్రామంలోని ఎస్సి, బిసి వసతి గహలను మల్లి పరిశీలించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -పొదలకూరు : డిఎంహెఒ పెంచలయ్య ఆదేశాల మేరకు ఆజాదికా అమత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రమేష్‌ఆధ్వర్యంలో మండలంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్‌లో బ్లాక్ లెవెల్ హెల్త్ మేళానిలి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు ఎనుంబాక చంద్ర శేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఆరోగ్య విస్తరణ అధికారులు టి.రవికుమార్ , శ్రీనివాసులు ,ఆరోగ్య పర్యవేక్షకు రమణమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ కష్ణవేణి ఉన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా విజయభాస్కర్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండల ఉప తహశీల్దార్‌గా ఎస్ విజయభాస్కర్ సోమ వారం బాధ్య తలు చేపట్టారు. ఆయన గుడ్లూరు మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయన భూసర్వేకు సంబంధించి ఉప తహశీల్దార్‌గా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించనున్నట్లు తెలిసింది. బాధ్యతగా పని చేసి రైతులకు న్యాయం చేస్తానని చెప్పారు.



రైతులకు సూచనలు

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలో సుమారు 250 ఎకరాల వేరుశనగ, 1050 ఎకరాల్లో వరి సాగు చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేరుశెనగ ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖాధికారిణి బి తిరుమల జ్యోతి రైతులకు కొన్ని సూచనలు చేశారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పిలుపుమేరకు ఆనందాపురం గ్రామంలో తల్లపనేని వెంకటేశ్వర్లు, తల్లపనేని గోపి ఆధ్వర్యంలో తుపాన్ బాధితులకు నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. సుమారు 50 మందికి 15కేజీల బియ్యం, కూరగాయలు,ఇతర నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు.

పేదలకు భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పిలుపు మేరకు 3వ వార్డు వైసిపి నాయకులు యడ్ల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో తుఫాను బాధితులకు భోజనం, అల్పాహార సౌకర్యం కల్పించారు. పునరావాస కేంద్రాన్ని పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఏర్పాటు చేశారు.

'స్పందన'కు ఏడు అర్జీలు

ప్రజాశక్తి -కందుకూరు :మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 7 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు.స్పందనను సద్వినియోగం చేసుకోవాలనికమిషనర్ కోరారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలో ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డ నిందితులు ఇచ్చిన సమాచారం అధారంగా నగరంలో పలు ప్రాంతాల్లో ఎస్‌ఈబి సిబ్బంది దాడులు నిర్వహించగా 12 కేజీల గంజాయి, రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి సిహెచ్ విజయరావు తెలిపారు. వెంగళరావు నగర్ ప్రాంతానికి చెందిన షేక్.సలీం, షేక్ సల్మాన్, ఎన్.వెంకటేశ్వర్లు, షేక్ తసీం, ఎం.మురుగేష్, వెంకటేష్ శివ అను ఆరు మంది నిందుతులను ఆదివారం నగరంలోని ఉమేష్ చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు మీడియాకు వెల్లడించారు. వెంగళరావు నగర్‌లో ఎస్‌కె సలీం అనే అనుమానితుడిపై పోలీసులు నిఘా ఉంచి అతని ఇంటిపై దాడి చేసి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మౌలిక సదుపాయాలను పట్టణ స్థాయికి పెంచాలి

రాజ్యసభలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మౌలిక సదుపాయాలను పట్టణ స్థాయికి పెంచేందుకు అవసరమవుతుందని పార్లమెంట్‌లో రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. 2036 నాటికి భారతదేశంలో 60 కోట్ల మంది (జనాభాలో 40 శాతం) పట్టణ ప్రాంతాల్లో నివసిస్తు న్నారు.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారతదేశ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ అవసరాలు ఉంటాయి. కమర్షియల్ ఫైనాన్సింగ్‌కు పరిమితులు పాలసీ చర్య అవకాశాల కోసం భారతదేశానికి యుఎస్‌ఎస్ 840 బిలియన్లు (సంవత్సరానికి యుఎస్‌ఎస్ 55 బిలియన్లు చొప్పున) తదుపరి పదిహేనేళ్లకు ప్రస్తుతం ఉన్న 10.6 బిలియన్ల నుండి ఏటా నగర మౌలిక సదుపాయాలను పట్టణ స్థాయికి పెంచేందుకు అవసరం అవుతుంది. దీనిపై ప్రభుత్వం అభిప్రాయం.పైన పేర్కొన్న బిలియన్లలో సగం ప్రాథమిక అవసరాలకు అవసరమ వుతుంది.పట్టణ అవసరాలను తీర్చడానికి అటువంటి వనరులను సమీకరించడానికి ప్రభుత్వం ప్రణాళికను వివరించమని ప్రశ్నించారు.అందుకుగాను స్పందించిన కేంద్రమంత్రి శ్రీ కౌషల్ కిషోర్, జాతీయ కమిషన్ జనాభా అంచనాల ప్రకారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, 2036 నాటికి దాదాపు 60 కోట్ల మంది (సుమారు 40 శాతం, భారతదేశంలోని అంచనా వేసిన జనాభాలో) పట్టణ ప్రాంతాల్లో నివసిస్తారు.వేగవంతమైన పట్టణీకరణతో దేశ ఆర్థిక అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ప్రాథమిక అవసరాలతో సహా పెరుగుతున్న పట్టణ మౌలిక సదుపాయాల అవసరాలు,ఇతర ప్రభుత్వ, ప్రయివేటు ఆర్థిక వనరుల ద్వారా భర్తీ చేయబడిన బడ్జెట్ మద్దతు ద్వారా రవాణాకు నిధులు సమకూరుతున్నాయి.నిధుల అంతరాన్ని తగ్గించడానికి, ప్రయివేట్ వనరులను పెంచుకోవడం, మున్సిపల్ రుణాలు పబ్లిక్- ప్రయివేట్ పార్ట్‌నర్ షిప్‌లతో సహా ఆర్థిక వనరులు రాబోయే సంవత్సరాల్లో ముఖ్యమైనవిగా ఉంటాయని తెలిపారు.

'మాండూస్' ప్రభావిత ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ పరిశీలన

కందుకూరు :కందుకూరు డివిజన్లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను సబ్ కలెక్టర్ శోభిక సోమవారం పరిశీలించారు. నిండుకుండలా మారిన రాళ్లపాడును ఆమె పరిశీలించారు. ప్రజల రాక పోకలకు అంతరాయం కలిగించిన వాగులు, వంకలను ఆమె పరిశీలించారు. కందుకూరు డివిజన్లో 396.6 మిల్లీమీటర్ల వర్షపాతం సోమవారం నమోదయింది. పొగాకు, మిర్చి, మినుము పంటలు దాదాపు పూర్తిగా దెబ్బతిన్నాయి.

జలదిగ్బంధనలో దళిత కాలనీ

కందుకూరు మున్సిపాలిటీ 9వవార్డు దళిత కాలనీ జలదిగ్బంధనలో కూరుకు పోయింది. ప్రదాన రహదారిఉప్పువాగు పొంగిపొర్లుతున్న కారణంగా రాక పోకలు నిలిచిపోయాయి.రాళ్లపాడు రిజర్వాయర్ గేట్లు ఎత్తి మన్నేరుకి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ఉప్పువాగు నుంచి మన్నేరుకి కలవాల్సిన నీరు వెనక్కునెట్టడంతో ఉప్పువాగు ఉదతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే వార్డు చుట్టుపక్కల నీరు చేరినందున కందుకూరుతో సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. గనిగుంట, దివివారిపాలెం, మాల్యాద్రి లక్ష్మీ నరసింహ యస్.టి కాలనీ, ఇందిరమ్మ కాలనీ ,కాకుమానివారిపాలెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. పాలసేకరణ ,నిత్యావసర సరుకుల కొరకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నీట మునిగిన వరినాట్లు

మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వరి నాట్లు మునిగిపోయాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్‌లో మండలంలో 20-25 వేల ఎకరాలలో రైతులు వరిసాగు చేపట్టారు.కోవెరపాలెంలో సుమారు 500 ఎకరాల్లో, పాపిరెడ్డిపాళెం పరిధిలో మరో ఐదు వందల ఎకరాల్లో నార్లు పూర్తిగా నీటమునిగాయి. ఎకరాకు రూ. 10-15 వేల వరకు ఖర్చు చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.భారీ వర్షాలకు పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజన కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రోడ్ల ఎత్తు పెరిగి ఇళ్ళ మట్టాలు లో లెవల్ కు చేరుకున్నాయి. దాంతో వర్షం నీరు ఇళ్లలోకి చేరింది

పొదలకూరు :మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో భారీ వర్షాల కారణంగా నిమ్మ చెట్లు నీట మునిగాయి. అంగన్‌వాడీ స్కూల్ జలదిగ్బంధనలో కూరుకు పోయింది. ఇటీవల గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. వర్షపు నీరు వెళ్లేందుకు డ్రయినేజీ వ్యవస్థల లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.దీంతో ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వలేటివారిపాలెం :మాండూస్ ప్రభావం మండలంలో కనిపించింది. గత నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది.వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. బడేవారిపాలెం వద్ద ఎర్రవాగు పొంగింది. సోమవారం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు వాగుల వద్ద విధులు నిర్వహించారు. మినుము పంట పూర్తిగా దెబ్బతింది. పొగాకు పంటకు సంబంధించి నాట్లు వేశారు. పొగతోటలు వర్షానికి ఉరకలెత్తాఇ. రైతులు తీవ్రంగా నష్టపోయారు. 'మండూస్'తో భారీగా నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్

'రాళ్లపాడు'కు భారీగా వరద నీరు

మూడు గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - లింగసముద్రం :తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం ఉదయంకు 20.5 అడుగులకు చేరింది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ఎగువ ప్రాంతం నుంచి 1000 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉండటంతో తొలుత 3వ నెంబరు గేటును ప్రాజెక్టు ఎస్ఇ లక్ష్మారెడ్డి ఆన్‌చేసి మన్నేరుకు 1000 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంతో నాలుగో నెంబర్ గేటును, ఐదు నెంబర్ గేటు ఎత్తి 2,100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు .ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని మన్నేరుకు విడుదల చేస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత గేట్లు దించుతామని అధికారులు తెలిపారు. డిఈ లక్ష్మినారయణ, ఏఈలు చంద్రమౌళి, సింధూజ,సిబ్బంది ప్రాజెక్టు వద్దనే అప్రమత్తంగా ఉంటూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. తహశీల్దార్ సుధాకర్, వైసిపి నేత వరికూటి క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

'రాళ్లపాడు'ను సందర్శించిన సబ్ కలెక్టర్

రాళ్లపాడు ప్రాజెక్టును కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టు నీటి పరిస్థితిని, ఎగువ ప్రాంతం నుండి వస్తున్న నీటి వివరాలను అధికారులు వివరించారు. ప్రజలు సందర్శన కోసం వస్తుంటారని, భద్రత దృష్ట్యా నలుగురు కానిస్టేబుళ్లను పెట్టాలని లింగసముద్రం ఎస్ఐ ఆవుల వెంకటేశ్వర్లుకు సూచించారు.

అధికారులు అప్రమత్తం :తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. తహశీల్దార్ ఎంవిఎస్ సుధాకర్ తన సిబ్బందితో కలిసి మన్నేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.



నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి

సుస్థిరాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -ఉలవపాడు :స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో సోమవారం గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికలపై' శిక్షణ జరిగింది. ఎంపిడిఒ ఎల్ చెంచమ్మ మాట్లాడుతూ గ్రామాల్లోని అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తిస్తూ పంచాయతీలు సుస్థిరాబివద్ధి లక్ష్యాల సాధనకు కషి చేయాలని తెలిపారు. టిఒటిలు, మండల స్థాయి అధికారుల ద్వారా గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ నిర్వహించారు. పంచాయతీ కార్య దర్శులు, కరేడు, చాకిచెర్ల, పెదపట్టపుపాలెం, రామాయపట్నం, వీరేపల్లి, చా గొల్లు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అధికారులు స్వీకరించిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్దిష్టమైన గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో సంయుక్త కలెక్టర్ కూర్మనాథ్, డిఆర్ఒ శ్రీమతి సి వెంకటనా రాయణమ్మలతో కలసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి -కందుకూరు :ప్రజల భాగస్వామ్యం లేకుండా గ్రామాల అభివద్ధి చేయటం సాధ్యం కాదని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికలపై సోమ వారం స్థానిక ఎండిఒ కార్యాలయంలో శిక్షణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చక్కబడాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. గ్రామ అభివద్ధి కుంటు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వాలు ప్రణాళిక రూపొందించమని కోరుతూ ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేద న్నారు. మంచినీటి పైపులు లీకులు అరికట్టలేకపోతున్నార న్నారు. ఈ పద్ధతి మారాలన్నారు. పంచాయతీలు అన్ని విధాల అభివద్ధి చెందాలంటే అందరూ సమిష్టి కృషి చేయాలని మహీధర్ రెడ్డి సూచించారు. ఎంపిపి ఇం టూరి సుశీల, ఎంపిడిఒ పి విజయ శేఖర్ ,సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు పురపాలక సంఘ పరిధిలో ప్రతిరోజు నీటి సరఫరా చేసే ఎస్ఎస్ ట్యాంక్ పంపు హౌస్‌లో రాత్రి భారీ వర్షానికి 11 కెవి విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి 33 కెవి స్తంభంపై వాలింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ వెంటనే స్పందించి జనరేటర్ సహాయముతో పంపింగ్ చేయించి నీటి సరఫరా చేయించారు.

మంత్రి కాకాణి కృషితో

పక్కా గృహాలు మంజూరు

పొదలకూరు :మండలాన్ని నుడా పరిధిలోకి చేర్చిన తర్వాత 5,100 పక్కా ఇళ్లను పేదలు నిర్మించుకునేందుకు మంజూరు చేయించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ఈ ఇళ్లను లబ్ధిదారులు జగనన్న కాలనీలతో పాటు, తమ సొంత స్థలాల్లో సైతం ఇల్లు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో ఇల్లు మంజూరై శిథిలావస్థకు చేరుకున్న ఇంటి యాజమానుల సైతం నూతనంగా ఇళ్లను పొంది నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని వారు, మిగిలిపోయిన వారికి కూడా కొత్తగా మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలం ఇప్పించడంతోపాటు, పక్కా ఇల్లు మంజూరు చేయించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.

'ఆధార్' అప్‌డేట్‌పై అవగాహన

నెల్లూరు : ఆధార్ అప్డేట్ కు సంబంధించి విస్తతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఆధార్ పొంది ఇప్పటివరకు ఎక్కడా కూడా ఆధార్ కార్డును వినియోగించని వారు తప్పనిసరిగా ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని సూచించారు. అలాగే బాలాధార్ కార్డు పొందిన చిన్నపిల్లలకు ఐదేళ్లు పూర్తయిన వెంటనే ఐరిష్, బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- జెడ్‌పి సిఇఒ, ఇన్‌ఛార్జి డిపిఒ చిరంజీవి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : మాండూస్ సైక్లోన్ కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తుపాన్ ప్రభావం తగ్గనందువల్ల మండలంలో పర్యటించిటనట్లు జెడ్‌పి సిఇఒ, ఇన్‌ఛార్జి డిపిఒ చిరంజీవి అన్నారు. ఈ మేరకు ఆత్మకూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా బ్లీచింగ్ వెళ్లే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిఒ 187ను సవరించాలి

ప్రజాశక్తి-కోవూరు : ఉపాధ్యాయుల బదిలీలు కోసం జిఒ 187లో సవరణలు జరపాలని ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బచ్చు డేవిడ్ చిన్న బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత బదిలీలలో బదిలీ పొంది ఇప్పుడు రేషలైజేషన్‌లోని వారికి పాత స్టేషన్ పాయింట్లను కేటాయించాలన్నారు. వికలాంగులకు కేటాయించిన ప్రాధాన్యత పాయింట్ల మధ్య శాతం పరంగా వ్యత్యాసం ఉండుట వలన వారి సర్టిఫికెట్‌లపై విచారణ సమగ్ర స్థాయిలో జరిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగుల కేటగిరిలో కొంతమంది ఉపాధ్యాయులు నకిలీ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తున్నారని తెలిపారు. బదిలీలకు అప్లై చేసిన అందరూ వికలాంగులను స్టేట్ మెడికల్ బోర్డు రెఫర్ చేసి నిర్ధి నిర్ధారణ చేసిన తర్వాతే బదులు అవకాశం కల్పించాలన్నారు.ప్రిఫరిన్సియల్ కేటగిరిలో గతంలో పాయింట్లను పొందిన వారు వేరొక అంశంలో 8/5 సంత్సరకాలం పూర్తి కాక పోయిన అవకాశం ఇవ్వాలన్నారు.టీచర్ల ఎవరు కూడా డిఇఒపుల్ లో లేకుండా బదిలీలు జరపాలి. గుర్తింపు పొందిన సంఘాల జిల్లా ప్రధాన బాధ్యతలకు ఇచ్చే ప్రాధాన్యతా పాయింట్లు గతంలో మాదిరిగా కొనసాగించాలన్నారు. ఉద్యోగోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన వారికి సంంధించిన ఖాళీల గురించి, వారు బదలీలలో అనుసరించాల్సిన విధానాల పై సమగ్ర సమాచారం ఇవ్వాలని నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్ రావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పాల పద్మావతి, ఇందుకూరు పేట మండల కన్వీనర్ షేక్ సలీంలు కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-అల్లూరు : ప్రతిఒక్కరూ విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని అల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని వెంగనగుంట, పెయ్యలవారి వీధి, ఆర్‌డిఆర్ గిరిజన కాలనీలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అనేక సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాండూస్ తుపాన్ ప్రభావంతో ప్రతిఒక్కరూ అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారని ప్రధానంగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోరారు. ఇళ్లల్లోకి దోమల రాకుండా తలుపులు మూసుకొని అలాగే ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో టార్టాయిస్ వెలిగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమా సిబ్బంది సాయి, స్రవంతి, తదితరులున్నారు.

పంట మునక


దెబ్బతిన్న శనగపంట

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని రైతుల మీద అకాల వర్షం కన్నీరు తెప్పించింది. మండల పరిధిలోని వందల హెక్టార్ భూముల్లో వేసిన పంటలు చేతికొచ్చే దశలో మాండూస్ తుపాన్ కారణంగా కురు స్తున్న వర్షాలకు పూర్తిగా నష్టపోయా యి. ఒక్క ఇరువురు పరిధిలోనే వందల ఎకరాల్లో వేసిన పచ్చిశనగ నీట మునిగి రైతులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. పొద్దు తిరుగుడు పంట సైతం నీట మునిగి మొక్క దశలోనే పూర్తిగా నాశనమై రైతును కోల్కోలేని విధంగా దెబ్బతీసింది. చేతి కొచ్చిన వరి పంట వర్షాల కారణంగా ధాన్యం మొత్తం రాలిపోయి రైతును తీవ్ర నష్టాల్లోకి నెట్టివేసింది. అనేక ఆశలతో అప్పు చేసి మరి పంటను వేసిన రైతు నిలువున నీటిలో మునిగిపోయాడు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.

పందుల పెంపకందారులతో కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్ : పందుల పెంపకందారులతో మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆత్మకూరులో పందుల పట్టివేత చేపట్టిన తెలుసన్నారు. మరోసారి పందులను పట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. పందులకు కేటాయించిన స్థలాలలో తరలించుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు

- పలుచోట్ల అధికారులకు శిక్షణ కార్యక్రమాలు



ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ నాగమణి ప్రారంభించారు. ఈ శిక్షణలో ప్రత్యేకాధికారి పి.రమణ ప్రాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ప్రణాళికలు తయారు చేసేటప్పుడు పంచాయతీ అవసరాలను, మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకొని తయారుచేయాలన్నారు. పంచాయతీలోని అన్ని శాఖల పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసేటప్పుడు ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మండలాధికారులను భాగస్వామ్యం చేసి జిపిడిపి కార్యక్రమంలో అవగాహన కల్పించామన్నారు. షెడ్యూల్ ప్రకారం శిక్షణాలో వారికి అవసరమైన అంశాలను తెలియజేసి వారి ద్వారా పంచాయతీలో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసి మండల ఎంపిడిఒ, ఎంపిపి ద్వారా ఆమోదింపజేసి రాబోవు ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికాపరంగా పనులను పూర్తి చేయవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి జి.లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ విజయభాస్కరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని తోటల చెరువుపల్లి, తూర్పు రొంపిదొడ్ల, దక్కునూరు, ఇరువురు, నార్ల కృష్ణంరాజుపల్లి, నార్ల కొండయ్యపాలెం, గువ్వాడి జి కొండ రెడ్డిపల్లి గ్రామాల నుండి సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పోలీసులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పేదరికం లేని, మెరుగైన జీవనోపాదుల గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నేటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రమైన మరియు హరిత గ్రామం, స్వయం సమృద్ధిలో మౌలిక సదుపాయాలు గల గ్రామం, సామాజిక న్యాయం, సామాజికంగా శుభ్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం అనే అంశాలపై శిక్షణ తరగతులు చేపట్టారు. కార్యక్రమంలో శిక్షకులుగా వెంకటకృష్ణ, సురేష్, రాకేష్, థామస్‌లు వ్యవహరించారు. జోరు వానలో కూడా మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తరలివచ్చారు. కానీ వర్షానికి ఎంపిడిఒ కార్యాలయంలోని ప్రతి భవనంలో నీరు కారుతూ తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సచివాలయ సిబ్బంది రామకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి అధ్యక్షులు పెయ్యల సంపూర్ణమ్మ పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో అన్ని శాఖల వారికి సముచిత స్థానం కల్పించాలని అది జరిగినప్పుడే గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ డైరెక్టర్ కాలవ నరసింహులు, ఎంపిడిఒ మధుసూదన్ రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎంఇఒ బాలకృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, విస్తరణాధికారి తిరుపతి టి ఒ టి రమేష్ పాల్గొన్నారు.

వసతి గృహంలో తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట

మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ఇందిర కాలనీలో ఉన్న ఎస్‌సి బాలుర వసతిగృహంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై.వెంకయ్య సోమవారం తనిఖీ చేశారు. బాయ్స్ హాస్టల్‌కు వెళ్లే రోడ్డు సమస్యపై జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ హాస్టల్‌కు వెళ్లే రోడ్డు సరిగ్గా లేనందున వర్షాలు పడుతున్నప్పుడు విద్యార్థులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రోడ్డు మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌సిడబ్ల్యు పెంచలయ్య, హాస్టల్ వార్డెన్ అనిత, తదితరులు ఉన్నారు.



పరిశ్రమలు నెలకొల్పితేనే అభివృద్ధి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు లాంటి మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు నెలకొల్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా మహాసభల సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిఐటియు నెల్లూరు జిల్లా 11వ మహాసభలు జయప్రదంగా జరుగుతున్నాయని తెలిపారు. తుపాన్ కారణంగా వర్షాలు కురుస్తున్నా వేల మంది కార్మికులు ప్రదర్శనను విజయవంతం చేయడం శుభసూచికమన్నారు. బ్రిటీష్ కాలంలో కార్మిక చట్టాలు కోసం పోరాడి సాధించుకున్న చట్టాలు, సమాన పనికి సమాన వేతనం గానీ బోనస్, పిఎఫ్, ఇటువంటి వాటిని ఎంతోమంది మన పెద్దలు త్యాగాల వల్ల హక్కులను సాధించుకున్నామని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు కోసం ఈ జిల్లాలో ఎంతో మంది దాతలు వందల ఎకరాలు దానం చేశారన్నారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థ జిల్లాలో వస్తుందని, తమ బిడ్డలకు ఉపయోగపడుతుందని, వేలాది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ఇవాళ ఆ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నవయుగ నుంచి అదానీ చేతుల్లోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క కార్మిక చట్టం కూడా కృష్ణపట్నం పోర్టులో అమలు కావడం లేదన్నారు. 8 గంటల పని లేదనీ, పిఎఫ్ లేదనీ, బోనస్ లేవని తెలిపారు. ఒక పరిశ్రమలో ఇటువంటి పరిస్థితి నెలకొంటే లేబర్ డిపార్ట్‌మెంట్, ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థ శ్రీ దామోదర్ సంజీవయ్య థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ నష్టాల బాట పట్టించి విద్యుత్‌ను కూడా ప్రయివేటుపరం చేయాలని రంగం సిద్ధం చేయడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. ఆత్మకూరులో ఉండే ఎంఎస్‌ఎంఇ పార్కులో పారిశ్రామిక వాటర్ ఏర్పాటు చేశారు కానీ, ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్ప లేదన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేదని తెలిపారు. ఈ ప్రాంతంలోని యువత, యువకులు దేశాల బాట పట్టి వలసలు పోతున్నారని తెలిపారు. ఉపాధి అవకాశాలు మెట్ట ప్రాంతంలో కల్పించాలన్నారు. మండలానికి ఒక ఫ్యాక్టరీ అయినా నెలకొల్పాలని, ఇక్కడ ఉండే మహిళలకు ఉపాధి కల్పించాలని, ఒక తీర్మానం చేశామన్నారు. చంద్రపడియలో ఒక ఫ్యాక్టరీ ఉందని, అది మృత్యు గృహంగా మారిపోయిందని తెలిపారు. ఇప్పటికీ ఎనిమిది మంది మృత్యువాతపడ్డారన్నారు. ఒక్క లేబర్ ఆఫీసర్ అక్కడికి వెళ్లలేదని విమర్శించారు. ఇంతవరకు యాజమాన్యంపై కేసు కూడా పెట్టలేదన్నారు. ప్రభగిరి పట్టణం ప్రాంతంలో కిసాన్ క్రాఫ్ట్ ఐటిఐ పాలిటెక్నికల్ చదువుకున్న యువకులతో ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తే అక్కడ కార్మిక హక్కులు లేవనీ, జీతం పెంచమని అడిగితే తీసేస్తామని, జీతం పెంచమని అడిగితే తీసేయడమేనా ఇది ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు టివివి ప్రసాద్ మాట్లాడుతూ ఈ మహాసభలలో ప్రధానంగా 5 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు పాదయాత్రలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారని తెలిపారు. మూడున్నరేళ్లయినా ఎక్కడ కూడా ఈ ఊసే లేదన్నారు. పైగా అవుట్‌సోర్సింగ్‌లో 10 సంవత్సరాలు లోపు ఉన్న వారిని తాము తొలగిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమైన ప్రకటన అని అన్నారు. వీళ్లను పర్మినెంట్ ఎలా చేయాలని ఆలోచించాలి కానీ, ఉన్న వారిని తొలగించడం సబబు కాదన్నారు. ఇలాంటి నిర్ణయాలు చేయడానికి ప్రభుత్వం 60 లేక 70 మందిని సలహాదారులుగా నియమించుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటువంటి సలహాలు ఇవ్వడానికి ఇటువంటి సలహాదారులు అక్కర్లేదన్నారు. కోవూరు సుగర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభిస్తామని జగన్మోహన్‌రెడ్డి చెప్పారనీ, కార్మికులందరి బకాయిలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత దాన్ని అమ్మేస్తామనడం సబబు కాదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు జివి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ మహాసభలు సహకరించిన కార్మికులకు, ఉద్యోగులకు అన్ని పార్టీల నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య పాల్గొన్నారు.



గురవయ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఉదయగిరి

ఇటీవల మరణించిన విహెచ్ పిహెచ్ జిల్లా నాయకులు గురవయ్య కుటుంబాన్ని ఎస్‌జిఎం సేవా సమితి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు దస్తగిరి అహ్మద్ పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం స్థానిక అరుంధతీయపాలెంలో విహెచ్ పి ఎస్ బెజవాడ గురవయ్య ఇటీవల అకాల మరణం చెందగా వారి కుటుంబానికి ఎస్‌జిఎం సేవా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబ యోగక్షేమాలను విచారించి, వారికి ధైర్యం ఇచ్చి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సాయాన్ని షేక్ దస్తగిరి అహ్మద్, షేక్ జాఫర్ అహ్మద్ షేక్ హుస్సేన్ అహ్మద్ అందజేశారు. వారి కుటుంబాలతో ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా వారికి భవిష్యత్తులో కూడా ఆసరాగా ఉంటామని ఆయన తెలియజేశారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి-కావలి

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రుద్రకోటలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు మేలింగి సందర్శనం తన సొంత నిధులతో సుమారు 40 మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం శీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మర్రిపాడు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణ పల్లి సచివాలయం పరిధిలో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వసంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటూ, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి వాటిని అక్కడ ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. మూడున్నరేళ్లలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95శాతం అమలు చేశామని గుర్తు చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, వైసిపి నాయకులు సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడల్లో 'ఎంఎస్‌ఆర్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కావలి

ఇటీ వల కావలి పట్టణం లో జరిగిన విక్ర మ సింహపురి యూని వర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం బిఎ విద్యార్థి బి.మోహన కృష్ణ రెండు పతకాలు సాధించాడు. షాట్ పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్స్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, విద్యార్థికి బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తల్లపనేని ఉమ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, వ్యాయామ అధ్యాపకుడు టి.బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయమందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కావలి

మాండూస్ తుపాను వల్ల గత 4రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో పట్టణంలోని పేదల జనజీవనం దెబ్బతిందని, ప్రభుత్వం గుర్తించి సహాయం అందించి పేదలను ఆదుకోవాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో ఆఫీస్ ఇన్‌ఛార్జి ఎం.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో నిత్యం కూలి పనులు, చేతివృత్తులు, చిరు వ్యాపారాలు ఇంకా రకరకాల పనులను చేసుకుని జీవించే పేదలు వేలాది మంది ఉన్నారన్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు ఈ నెలలో మాండూస్ తుపాను వల్ల ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో నివసించే పేదలు జీవనాధారం దెబ్బతిందని పూట గడవని పరిస్థితులు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పట్టణంలో చెరువు కట్ట గిరిజన సంఘం, శివరామసుబ్బయ్య కాలనీ, బుడంగుంట గిరిజన కాలనీ, బాలకృష్ణారెడ్డి నగర్, ముసునూరు గిరిజన కాలనీ, కొనదిన్నె గిరిజనకాలనీ, కాలేరు గుంట కాలనీ, జొన్నయగుంట గిరిజన కాలనీ, ఇంకా మరికొన్ని ప్రాంతాలలో నిరుపేదలు ఉన్నారని తెలిపారు.


ఆఫీస్ ఇన్‌ఛార్జికి వినతి అందజేస్తున్న సిపిఎం నాయకులు

వీరందరూ ఈ వర్షాలతో చేసుకునేందుకు పనులు లేక చిరు వ్యాపారాలు జరగక రకరకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరికి పూట గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా కొన్ని కాలనీలలో రోడ్లంతా జలమయమై, తిరగలేని పరిస్థితులలో ఉన్నారన్నారు. ఈ ప్రాంతాలలో ప్రభుత్వ అధికారులు పరిశీలించి, వారి బాధలను తెలుసుకోవాలని, ప్రభుత్వం వెంటనే ఇంటికి 25 కేజీల బియ్యం, రూ.5వేల నగదు, తక్షణ సహాయం అందించి, పేదలను ఆదుకోవాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్‌రావు, బి.కృష్ణయ్య, కే.చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యార్థులలో సామాజిక మానసిక నైపుణ్యాల అభివృద్ధి పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు 9 రోజులు శిక్షణ ఇస్తున్నట్లు ఎంఇఒ మస్తాన్ వలీ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గండిపాలెం ఎపిఆర్‌ఎస్‌లో ఈ కార్యక్రమాన్ని కోర్స్ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనను మెరుగుపరచుకొని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడానికి, విద్యార్థులలో సామాజిక మానసిక నైపుణ్యాల అభివృద్ధి కోసం ఉపయోగమని తెలిపారు. ఈ శిక్షణ ఉదయగిరి, సీతారాంపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు ప్రతి మండలానికి ముగ్గురు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ముగ్గురు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ముగ్గురు సిఆర్‌పిలు పాల్గొంటున్నారు. ఈ శిక్షణ 12 తేదీ నుండి 21వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు జరగనుందని తెలిపారు. కోర్స్ డైరెక్టర్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె నూర్జహాన్, ఎపిఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ జి మురళి కృష్ణ, రిసోర్స్ పర్సన్స్ సిహెచ్ శ్రీనివాసులు, కె.వి.రమణయ్య పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలకు బెదరం : వైసిపి

ప్రజాశక్తి-కొడవలూరు

కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని వైసిపి నేతలు మండలంలో పోటాపోటీగా సంబరాలు చేసుకున్నారు.కోవూరు నియోజకవర్గంలో ఆది నుంచి వైసిపిలో మండల వర్గపోరు నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందే. సోమవారం జరిగిన శాసనసభ్యులు పుట్టిన రోజు వేడుకలను మండలంలో పార్టీ మండలాధ్యక్షుడి వర్గం ఒక వేదికలోనూ.. మరో వర్గం వవ్వేరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ మరో వేదికలోనూ వేడుకలు నిర్వహించారు. ఇలా ఒక పార్టీ నాయకుడు జన్మదిన వేడుకలు ఒకే పార్టీ శ్రేణులు వేరువేరుగా జరుపుకోవడంతో మరోసారి వర్గపోరు బయటపడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో భాగంగా వైసిపి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్ రెడ్డి, చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి


కేక్‌ను కత్తిరిస్తున్న వైసిపి నాయకులు


500 మందికి అల్పాహారం, అన్నదాన కార్యక్రమం, ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఫ్రూట్స్, పాలు పంపిణీ చేశారు.అనంతరం 50మంది రక్తదానం నిర్వహించారు. అనంతరం 61 కేజీల భారీ కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు.ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు మాట్లాడుతూ శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అభివద్ధి మరువులేనిదన్నారు.పిలిస్తే పలికే నాయకుడని ప్రతి ఒక్కరిని గుర్తుంచుకొని సముచిత స్థానం కల్పించారన్నారు.ఆయన సుఖ:సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు.ఎన్.పి.ఆర్ అంటే నిత్యం ప్రజలకోసం తాను ఉన్నానని చెప్పడమే అన్నారు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రజల మనిషి అని 2024 లో కూడా ఆయన్ని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని నాయకత్వంలో పని చేయడం ఓవరం అని తెలియజేశారు.అనంతరం వవ్వేరు సొసైటీ బ్యాంక్‌లో సూరాశ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో భాగంగా మైనారిటీ నాయకులు పెద్ద అల్లాబక్షు అధ్యక్షతన పెద్ద ఎత్తున కార్యాకర్తలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు మాట్లాడారు. సూరా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నాయకత్వం అనేది క్యాడర్ కలిగి ఉంటుందన్నారు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డికే ఇది సాధ్యం మన్నారు.గ్రూపులు కట్టిన గుండాయిజం చూపిన భయపడేది లేదని తెలిపారు.

కావలి కాలువకు 'కండ్లగుంట' ఎనలేని కృషి



ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి కాలువకు కండ్లగుంట మధుబాబు ఎనలేని కృషి చేశారు. తొలుత ఆయన 1994 సింగిల్ విండో అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బోగోలు ప్రాంతంలోని పడమట ప్రాంతమంతా కావలి కాలువపై రైతులు ఆధారపడి వ్యవసాయ జీవనం సాగించే వారు. కావలి కాలువలో నీరు వచ్చి రాని పరిస్థితులతో సాగునీటి కోసం రైతులు పడే ఇబ్బందులు పడేవారు. ఆ సమయంలోనే ఎలాగైనా కావలి కాలువ వెడల్పు జరిగి ఎక్కువ నీరు వచ్చే విధంగా చేయాలని ఆలోచన ఉండేది. కావలి నియోజకవర్గంలోనే కాలువ పారుదల ఉంది. ఎలాగైనా వెయ్యి క్యూసెక్కులకు డిజైన్ మారి లక్ష ఎకరాలకు పారుదల రావాలనే పట్టుదల ఆయనలో ఉండేది. 2002 తరువాత ఎక్కువ కాలం కావలి కాలువ డిసి చైర్మన్‌గా ఉండటం, 2008లో సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌గా కావలి కాలువ అణువు అణువు తెలుసుకున్నారు. 14 డిస్ట్రిబ్యూటరీలు మైనర్ కాలువలు జీఫ్ ట్రాక్‌లు ఆధునికీకరణకు కృషి చేశారు. ఆనాడు జిల్లా ఆర్థిక మంత్రిగా అనం.రామనారాయణరెడ్డి తోడ్పాటు అందించారు. వైఎస్‌ఆర్


సమస్యలపై రైతులతో మాట్లాడుతున్న మధుబాబునాయుడు (ఫైల్)

జలయజ్ఞంలో భాగంగా కావలి కాలువ ఒక సిమెంట్ లైనింగ్ వర్క్‌కు టెండర్ పిలిచారు. సోమశిల చైర్మన్ ఉన్నప్పుడు సాగునీటి సంఘాలను కలుపుకొని హైకోర్ట్ రైతుల పక్షాన పిటిషన్ సొంత ఖర్చులతో వేసి స్టే తొలగించారు. బొల్లినేని రామారావు, బీద సోదరులు ఆనాటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పనులు ప్రారంభించారు. ఇప్పుడు కావలి కాలువ 1000 క్యూసెక్కులతో ఆధునికీకరణ జరిగి లక్ష ఎకరాలకు నీరు అందుతుంది. రామాయపట్నం పోర్ట్ సాధన పోర్ట్ వస్తే కావలి భవిష్యత్తు మారుతుందని కండ్లగుంట మధుబాబు నాయుడు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న వెంకటప్రసాద్

ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని చిరమన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య అదనపు వైద్య అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో చిరమన డాక్టర్ రహంతున్నిసా బేగం, డాక్టర్ నిర్మలా రాణి, పి హెచ్ ఎన్ బి జ్యోతి, వి పి హెచ్ ఇ ఒ షేక్ షఫీ, హెచ్ వి వి సలోమి, ఆశా వాలంటీర్స్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న దళితులు

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించడం తగదు

ప్రజాశక్తి-కావలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన దళితులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో 15సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం స్థానంలో కొందరు అంగడి పెట్టి విగ్రహాన్ని రేకులతో కప్పివేశారన్నారు. అంతేకాకుండా విగ్రహం చుట్టూ కుళ్లిపోయి కూరగాయలు, చెత్తను చేస్తున్నారన్నారు. ఈ విషయమై షాప్ యజమాని అడుగగా అతను దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. భారతదేశ ప్రజలందరూ గౌరవించాల్సిన భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానకరంగా రేకులతో మెడ వరకు కత్తిరించి చెత్తా చెదారం కూలిపోయిన కూరగాయలు వేస్తూ అంబేద్కర్‌ను అవమానిస్తున్న అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. షాపు యజమానిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు జడ్డా వాసు, జె.విజయరావు, టి.తిరుపతి, శ్రీనివాసులు, ఆలూరి తిరుపతి, బ్రహ్మయ్య, ముక్కు మోహనరావు, నెల్లూరు మాల్యాద్రి, గోళ్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కొడవలూరు

కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తిని మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాలెం అంబేద్కర్ నగర్‌లో రెండ్రోజుల క్రితం జరిగింది.సేకరించిన వివరాలు మేరకు.. పల్లం అశోక్, పల్లం చాందిని (32) గత 15 ఏళ్ల క్రితం వీరిద్దరికి పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, పెద్ద పాప హేమ అంకిత, చిన్న పాప దీక్ష అన్విత లున్నారు. అశోక్ తాగుడుకు బానిసై చాందినీని నిత్యం వేధించేవాడు. దీంతో అనేక పర్యాయాలు, దిశ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు చాందిని తల్లిదండ్రులు తెలిపారు. బాధితులు ఫిర్యాదులను అందుకున్న దిశ పోలీస్ అధికారులు, అశోక్ చాందినీలకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఒకటి చేసి పంపడం పలుమార్లు జరిగింది. ఈ నేపథ్యంలో గత నాలుగో తేదీ భార్యాభర్తలు ఇరువురి మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో చాందిని ఎలుకల మందు తిని, ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు నెల్లూరు బొల్లినేని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స అందించారు. చాందిని ఆరోగ్యం మెరుగుపడిందని, ఈనెల 10వ తేదీ వైద్యశాల నుంచి డిఛార్జి చేయడం జరిగింది. బుచ్చిరెడ్డిపాలెం తమ స్వగృహంలో సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉన్న చాందిని, తన శరీరంలో ఎలుకల మందు ప్రభావం పూర్తిగా తగ్గకపోవడంతో, మరలా సీరియస్ ప్రభావం చోటుచేసుకుంది. వెంటనే బంధువులు మరలా బొల్లినేని వైద్యశాలకు తీసుకొచ్చారు. 11వ తేదీ ఆదివారం చికిత్స పొందుతూ చాందిని తుది శ్వాస విడిచింది.